క్లుప్తంగా

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం



భువనేశ్వరీదేవికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెం శివారు మణిపురంలో కొలువైన శ్రీభువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచే బారులుతీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మండలానికోసారి అమ్మవారికి నిర్వహించే ఈ అధివాసంలో ఒక్కో అధివాస మహోత్సవాన్ని ఒక్కో పత్రితో నిర్వహిస్తారు. ఈసారి సంపంగి పత్రితో జరిపారు. ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహోత్సవంలో భాగంగా అమ్మవారి సన్నిధిలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న కొటాన రాము

సబ్బవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తనకు సముచిత స్థానం కల్పించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పార్టీ రాష్ట్ర బీసీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కొటాన రాము అన్నారు. ఈ మేరకు సబ్బవరం కొత్తరోడ్డులోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మండల పార్టీ నేతగా, కో ఆపరేటివ్ సభ్యుడిగా, జెడ్పీటీసీ తదితర పదవులు నిర్వహించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన అధినేత జగన్‌తోపాటు, అందుకు కారకులైన నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు పెంటమాంబ ఆలయ ఆవరణలో కొలువుదీరిన మహాశక్తి, భూలోకమ్మ, దుర్గాలమ్మ, కుంచుమాంబ, మరిడిమాంబ, శ్రీశక్తి అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమాలు నిర్వహించారు. నెల్లిముక్కు గ్రామ పెద్దలు, దొడ్డి పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణ పనులను చకచకా పూర్తి చేస్తామన్నారు.

పెందుర్తి కూడలి.. కష్టాల కడలి

'పెందుర్తి కూడలి వద్ద చినుకు పడితే చాలు వణుకొస్తుంది. ముఖ్యంగా నగరం వైపు వెళ్లాలంటే సముద్రాన్ని దాటి వెళ్లినంత భారంగా ఫీలవ్వాలి. పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన దుస్థితి'
– ఇదీ రమేష్ అనే బైకిస్ట్ ఆవేదన

'మా ప్రాంతంలో వర్షం పడితే నరకం చూస్తున్నాం. మా దుకాణాల ముందు నీరు భారీగా నిలిచిపోతుంది. దానికి మురుగు తోడవడంతో పెద్ద ఎత్తున బురద, మురుగు మేటలు వేస్తుంది. వర్షం పడిన రోజు దుకాణాలను తెరిచి అవస్థలు పడేకంటే.. మూసేయడమే మేలు'
– కూడలి వద్ద వ్యాపారుల పరిస్థితి



పెందుర్తి కూడలి వద్ద మూడు రోజులుగా ఇదే పరిస్థితి

- వర్షం సమయంలో నరకం చూస్తున్న ప్రజలు, ప్రయాణికులు
- నాలుగు రోడ్ల కూడలిలో భారీగా నిలిచిపోతున్న వర్షపునీరు
- దానికి మురుగునీరు చేరి వెదజల్లుతున్న దుర్గంధం
- బీఆర్‌టీఎస్ రోడ్డులో అవుట్‌లెట్ లేక అవస్థలు

పెందుర్తి: చినుకు పడితే చాలు పెందుర్తి పట్టణ ప్రాంత ప్రజలు చివురుటాకుల్లా వణికిపోతున్నారు. ముఖ్యంగా నాలుగు రోడ్ల కూడలి వద్ద నివాసులు, వ్యాపారుల బాధలు వర్ణనాతీతం. ఓ మోస్తరు వర్షానికే నగరం వైపు వెళ్లే మార్గంలోని బీఆర్‌టీఎస్ రహదారి ముంపునకు గురవుతుంది. రోడ్డుపై నీటి ప్రవాహానికి తగిన అవుట్‌లెట్ లేకపోవడంతో బీఆర్‌టీఎస్ డక్ట్‌ల్లోని నీరు బయటకు వచ్చి రోడ్డుపై నిలిచిపోతుంది. దీంతో వర్షం పడిన రోజు పెందుర్తి కూడలి చిన్నపాటి కడలిని తలపిస్తుంది.

ప్రయాణం నరకప్రాయం

నగరంలోని అత్యంత రద్దీ కూడళ్లల్లో పెందుర్తి నాలుగు రోడ్ల జంక్షన్ ఒకటి. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి నగరానికి వెళ్లే వాహనాలన్నీ దాదాపు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ సమయాల్లో ఈ మార్గంలో ప్రయాణం ఎలా ఉన్నా.. చిన్నపాటి చినుకులు పడినా ఇటుగా వచ్చే వాహనదారులు మాత్రం నరకాన్ని చవిచూడాల్సిందే. రోడ్డు మొత్తం వర్షపు నీరు, మురుగుతో నిండిపోవడంతో ఎలా ప్రయాణం చేయాలో పాలుపోని పరిస్థితి. అదే సమయంలో ఇక్కడి దుకాణాల వద్దకు నీరు చేరి, అడుగు ముందుకు వేయలేని దుస్థితి నెలకొంటోంది.



పెందుర్తి కూడలి బీఆర్‌టీఎస్ రహదారిపై ఆదివారం సాయంత్రం భారీగా నిలిచిన వర్షపు నీరు



పెందుర్తి కూడలిలో రోజుల తరబడి నిలిచిన నీరు



వరదనీటి కారణంగా పెందుర్తి కూడలి వద్ద ఆదివారం రాత్రి నిలిచిన వాహనాలు

నీరు పోయే మార్గం లేకే..

వాస్తవానికి పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రహదారి పూర్తిగా నిర్మించలేదు. రోడ్డు నిర్మాణంలో స్థలాలు కోల్పోయిన వారితో పరిహారం విషయంలో వివాదం ఉండడంతో కొంత మేర రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దీంతో వర్షపునీరు, మురుగు బయటకు వెళ్లేందుకు తగిన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కుదరడం లేదు. అదే సమయంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇటు ప్రజాప్రతినిధులు గానీ, అటు అధికారులు గానీ పూర్తిస్థాయిలో చొరవ తీసుకోవట్లేదు. దీంతో వర్షం పడిన ప్రతిసారీ తమకు ఈ తిప్పలు తప్పడం లేదని ప్రజలతో పాటు వాహనదారులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారం నా బాధ్యత



పెందుర్తి కూడలి వద్ద వరదనీటి తీవ్రతను గుర్తించాం. డ్రైనేజీ వ్యవస్థపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తాం. ఇప్పటికే దీనిపై తగు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచనలిచ్చాం. కొద్ది రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చేయడం నా బాధ్యతగా తీసుకున్నా. ప్రస్తుతం తలెత్తుతున్న సమస్య పట్ల దగ్గరుండి తాత్కాలికంగా నీటిని తొలగించే పనులు చేయిస్తున్నాం.
– పీలా శ్రీనివాసరావు, మేయర్

కాలువ నిర్మాణానికి టెండర్ పూర్తయింది



ఇక్కడి కూడలి వద్ద వర్షాకాలంలో నీటి సమస్యపై అనేక వినతులు వచ్చాయి. వర్షం పడిన ప్రతీసారి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించాం. మేయర్, మా ఉన్నతాధికారుల ప్రతిపాదనతో బీఆర్‌టీఎస్‌పై కాలువ నిర్మాణం కోసం నిధుల మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయింది. నెల రోజుల్లోపే పనులు ప్రారంభించే అవకాశాలున్నాయి.
– కె.హేమావతి, జెడ్సీ, జోన్–8

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికై పోరాటం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి



సభలో పాల్గొన్న సిటు సభ్యులు

- అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా 10వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి
- జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

సబ్బవరం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధమని సిటు రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి హెచ్చరించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సిటు) 10వ జిల్లా మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో మాతా శిశు మరణాలను తగ్గించి పిల్లలకు కౌమార విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వంలో 42 రోజుల పాటు సమ్మె చేయగా, వేతనాల పెంపు, గ్రాట్యుటీ చట్టాల అమలు హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ నేతలు సమ్మె శిబిరాలకు వచ్చి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా కనీసం పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. అంగన్‌వాడీల కనీస విధులతోపాటు, అదనపు బాధ్యతలు, యాప్‌ల పేరిట వేధించడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, అంగన్‌వాడీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా కోశాధికారి వీవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా జి.కుమారి, అధ్యక్షురాలిగా ఎం.దుర్గారాణి, ప్రధాన కార్యదర్శిగా నాగశేషు, కోశాధికారిగా వీవీ రమణమ్మ ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా ఎన్.వరలక్ష్మి, కె.రామలక్ష్మి, పి.భవాని, ఆర్.మహాలక్ష్మి, తనూజ, ఎం.రమణి, చిన్నమ్మలు, సత్యవేణి, మంగ, టి.సంతోషి, అంజలి, సీహెచ్ రామలక్ష్మితో పాటు మరో 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

భారీ వర్షాలకు పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ చిట్టినాయుడు



పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ చిట్టినాయుడు

సబ్బవరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పాడి రైతులంతా తమ పశువుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెంలో పాడి రైతులకు పలు సూచనలు చేశారు. పాడుబడిన పశువులశాలలో పాడి పశువులను ఉంచవద్దన్నారు. పశువుల కొట్టాల్లో వాటిని తాళ్లతో కట్టవద్దని సూచించారు. నీరు ఎక్కువగా ఉండే గుంటలు, చెరువులు, జలాశయాల వద్దకు తీసుకెళ్లవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉంచాలని, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తుఫాన్ సమయంలో మరణించినట్లైతే 24 గంటల్లో దగ్గర్లోని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌కు లేదా పశు వైద్యశాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర సేవలందించేందుకు మండలంలోని పశువైద్య సిబ్బందితో మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అధ్వాన రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



సబ్‌స్టేషన్ కూడలిలో అధ్వానంగా రహదారి



గోతులమయంగా ఊటగెడ్డ కూడలి



ఛిద్రమైన దలాయిపాలెం రోడ్డు

పరవాడ: మండలంలో పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పరవాడ-యలమంచి రహదారిలో ఊటగెడ్డ జంక్షన్, సబ్‌స్టేషన్ జంక్షన్, సినిమాహాలు జంక్షన్, దలాయిపాలెం రహదారులు గుంతలమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పరవాడ-యలమంచిలి రహదారిలో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్, హిందూజా పరిశ్రమలకు రాకపోకలు సాగించే బొగ్గు, బూడిద లారీలు కూడ ఈ రోడ్డు మీదుగానే వెళ్లాయి. టన్నుల బరువు కలిగిన బూడిద, బొగ్గు లారీల రాకపోకలతో రహదారులు అధ్వానంగా మారినప్పటికి వాటి బాగోగుల్ని పరిశ్రమల యాజమాన్యం, అధికారులు పట్టించుకోని పరిస్థితి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు భారీ గుంతలు పడి ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పనిచేసే వేలాది కార్మికులు, ఉద్యోగులు రాత్రుళ్లు విధులు ముగించుకుని ఇళ్లకు చేరే క్రమంలో ద్విచక్ర వాహనాలు గుంతల్లో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ఊటగెడ్డ కూడలిలో రోడ్డు మలుపులో ఏర్పడ్డ గుంతలు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. సబ్‌స్టేషన్ కూడలి మలుపు వద్ద రోడ్డు ప్రమాదంగా మారి ప్రయాణికులను నానా అవస్థలకు గురిచేస్తోంది. వాడచీపురుపల్లి-దలాయిపాలెం రోడ్డులో పలు చోట్ల ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దీపక్

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామంలోని రామాలయం వద్ద ఈ శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు ప్రారంభించారు. 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 19 మంకి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి, వారిని శంకర్ ఫౌండేషన్‌కు ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ దీపక్, క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చినముషిడివాడలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ఆత్మీయ కలయికలో ఆడీపాడీ సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబ పరిస్థితుల్ని ఒకరితో ఒకరు పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయులు సుజాత, అంజలిదేవి తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశా రు. ఫొటోలు తీసుకుని, ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మృతుడి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం

పెదగంట్యాడ: కుటుంబ పెద్ద అకస్మాత్తుగా మృత్యువాత పడితే ఆ కుటుంబం పరిస్థితి దారుణంగా ఉంటుందని, అటువంటి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలని కళింగ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎండా ఆదినారాయణ అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని నడుపూరు శిరవానిపాలేనికి చెందిన గురుబెల్లి ప్రకాశరావు అనే వ్యక్తి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబాన్ని ఆదివారం కళింగ సంఘం సభ్యులతో కలసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కళింగ సంఘం కుటుంబాల నుంచి సేకరించిన రూ. 40వేలను మృతుడి భార్యకి అందజేశారు.

రోజంతా వర్షం.. స్తంభించిన జనజీవనం



సింహాచలంలో రోడ్డుపైకి కొట్టుకొచ్చిన రాళ్లు



కొండ పైనుంచి వస్తున్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న జెడ్సీ



పాత అడవివరంలో బీఆర్‌టీఎస్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



ధర్మారాయుడుపేటలో వరి పొలాల్లో చేరిన వర్షం నీరు

- పొంగిపొర్లిన డ్రైనేజీలు, ముంచెత్తిన రోడ్లు
- కూలిన విద్యుత్ స్తంభాలు, మునిగిన పంట పొలాలు

సింహాచలం: ఎడతెరిపి లేకుండా ఆదివారం కురిసిన భారీ వర్షానికి అడవివరంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో ఉన్న పైడితల్లి ఆలయం ఎదురుగా సింహగిరి కొండల నుంచి పెద్ద ఎత్తున వర్షపు నీరు రోడ్డుపైకి వచ్చి వరదలా ప్రవహించింది. రాళ్లు కూడా రోడ్డుపైకి కొట్టుకొచ్చాయి. దీంతో బీఆర్‌టీఎస్ రోడ్డుపై వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ జోన్–8 జెడ్సీ హేమావతి పరిస్థితి సమీక్షించారు. రాళ్లను తొలగించారు. వర్షం నీరు రోడ్డుపైకి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించారు. పాత అడవివరం జంక్షన్‌లో బీఆర్‌టీఎస్ రోడ్డుపై వర్షం నీరు పోటెత్తింది. ద్విచక్రవాహనాలు సగం వరకు మునిగిపోయాయి. నీరు ఎటూ వెళ్లక భారీ స్థాయిలో నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సింహగిరిపై భక్తుల ఇక్కట్లు

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి సింహగిరికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంలో తడుస్తూనే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్లారు. చిన్నారులతో వచ్చిన పలువురు భక్తులు మరిన్ని ఇబ్బందులు పడ్డారు. సింహగిరి బస్టాండ్‌లో సరైన షెల్టర్ లేకపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

పరవాడ: మండలంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఈ.బోనంగి దరి బొద్దపువానిపాలెం దుర్గమాంబ ఆలయ సమీపంలో హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఫలితంగా బొద్దపువానిపాలెం, ఎన్టీఆర్, జగనన్న కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమస్యను తెలుసుకున్న జేఎన్‌పీసీ పరవాడ సెక్షన్ ఏడీఈ కనకారావు ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మరమ్మతు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన అధికారులకు, సిబ్బందికి గ్రామ సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.



దుర్గమాంబ ఆలయం వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



పెందుర్తి కూడలిలో నీటి తొలగింపు చర్యల్లో మేయర్

నారు మడులకు ఊరట

ఈ వర్షంతో ఖరీఫ్ రైతులకు కొంత ఊరట లభించింది. ఆకుమడులు ఎండిపోతున్న తరుణంలో కురిసిన వానపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు మోటార్ల సాయంతో పరవాడ, తానాం, రావాడ, కలపాక ప్రాంతాల్లో వరి నాట్లు వేశారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో పూర్తి స్థాయిలో వరి నాట్లు వేసుకోవచ్చని రైతులు చెప్తున్నారు. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు నాటిన యూకలిప్టస్, సరుగుడు మొక్కలకు ఈ వర్షం బాగా ఉపకరిస్తుందని రైతులు చెప్తున్నారు.